తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
02-04-2026
గురువారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 65
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

## ఆన్‌లైన్ ఒకలా.. ఆఫీస్‌లో మరోలా..
# నార్సింగి లో పన్నుల మోసం

- రసీదుల్లో ఒక మొత్తం.. ఆన్లైన్‌లో తక్కువగా నమోదు
- ప్రశ్నించిన ప్రజలపై దురుసు ప్రవర్తన, కేసుల బెదిరింపులు
- ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అక్రమాలు
- దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

5



**నార్సింగి, ఏప్రిల్ 1 (సిరి న్యూస్) :**

"దేశ అభివృద్ధిని చూడాలంటే గ్రామాల అభివృద్ధిని చూడాలి" అన్నది నానుడి. ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు 2018లో పంచాయతీ కార్యదర్శి వ్యవస్థను ప్రవేశపెట్టి, పన్నుల వసూళ్లు, అభివృద్ధి పనులు, పాలనా సౌలభ్యం వంటి అంశాలతో పాటు కార్యాలయ వ్యవస్థను పటిష్టం చేసింది.

## పొంగులేటి మైనింగ్ కథలో
# రాఘువ నీడలు !



### ప్రకృతిపై పంజా.. తుంగలో జీవో 111 నిబంధనలు

- మంత్రి ఇలాకాలో రెచ్చిపోతున్న సొంత మైనింగ్ మాఫియా
- అనుమతులు లేకుండానే వెలిసిన భారీ స్టోన్ క్రషర్
- రెండే రెండు తనిఖీలు.. రూ. 25 లక్షల పెనాల్టీతో సరిపెట్టిన వైనం
- భారీ డీజిల్ జనరేటర్లతో అక్రమ కార్యకలాపాలు
- మంత్రి అక్రమాలపై ఆధారాలతో విరుచుకుపడ్డ హరీశ్ రావు..
- రాజీనామా చేయాలంటూ బీఆర్ఎస్ పట్టు
- మంత్రిని వెనుకేసుకొస్తున్న కాంగ్రెస్ సర్కార్
- దృష్టి మళ్లించేందుకే గత పదేళ్ల లీజులపై

2

ఈ పరిధిలో ఎలాంటి కాలుష్యకారక పరిశ్రమలు, భారీ నిర్మాణాలకు తావులేదు. కానీ, ప్రస్తుత ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఈ జీవోను కేవలం ఒక కాగితం ముక్కగానే పరిగణించిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శంషాబాద్ మండలం, కొత్తవాల్‌గూడ పరిధిలోని సర్వే నంబర్ 62, 63లలో ప్రభుత్వం నిర్దేశించిన పర్యావరణ నిబంధనలను బేఖాతరు చేస్తూ, ఎకరాకు పైగా విస్తీర్ణంలో భారీ స్టోన్ క్రషర్‌ను ఏర్పాటు చేయడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

## కాజీపేట రైల్వే డివిజన్‌ను
# ఏర్పాటు చేయాలి

- పెద్దపల్లి-నిజామాబాద్ సెక్షన్ ను బదిలీ చేయొద్దు
- రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు లేఖ రాసిన కేటీఆర్
- మంత్రికి అందచేసిన బీఆర్ఎస్ ఎంపీలు
- సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి

3



## భూభారతి పోర్టల్‌తో తొలి అడుగు



రేపటి నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా..
స్మార్ట్ ఫోన్‌తో ఇంటినుంచే భూ సేవల లభ్యత
రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

3



## రేపు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

2

- 3వేల మంది పోలీసులతో బందోబస్తు



## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం

29మంది దుర్మరణం చెందినట్లు ధృవీకరణ

2



## ఆరు గ్యారెంటీలపై నిలదీయండి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

3

## ఉద్యోగులకు ఒరాకిల్ షాక్

ప్రపంచవ్యాప్తంగా 30వేల మంది తొలగింపు
అందులో 12వేలమంది భారతీయులు

2




## క్షీణిస్తున్న ఆత్మీయ
# అనుబంధాలు

- కుటుంబ విలువల పతనంతో అశాంతి

**వనపర్తి, ఏప్రిల్ 1:**

సమాజంలో పెరుగుతున్న అంతరాలు, కు టుంబ బంధాల క్షీణతపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గం లోని చిన్నదగడ గ్రామంలో గ్రామస్తుల sqrt(5) ముచ్చటించారు. ఆధునిక యుగం లో మనిషి నింగిలోకి శాటిలైట్లు పంపు తున్నప్పటికీ, కుటుంబ అనుబంధాలను కాపాడుకోవడంలో వెనుకబడిపోతున్నాడని

మిగతా 2వ పేజీలో..





## మంత్రి పొంగులేటిని
# సీఐడి ప్రశ్నించగలదా?

- ఆ విచారణలో తేలేదేమీ ఉండదు
- కడియం ఏ పార్టీలో ఉన్నారో తెలపాలన్నాం
- వీటి గురించి మాట్లాడితే కేసులతో వేధింపులా?
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

2



2

## కేరళలో సీఎం రేవంత్ రోడ్ షో

## కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

- జీతాలు నేరుగా ఖాతాల్లో జమ చేయనున్న ప్రభుత్వం
- వేలాదిమంది ఉద్యోగులకు లబ్ది చేకూరే అవకాశం

2

## వేసవి మంట
# భరించాల్సిందే



మూడు నెలలు ఎండలు, వడగాడ్పులు
భారత వాతావరణ శాఖ హెచ్చరిక

3




2

కొత్తగా నమోదు చేసుకున్న
# రైతులకు ఊరట




## ఉద్యోగులకు ఒరాకిల్ షాక్

- ప్రపంచవ్యాప్తంగా 30వేల మంది తొలగింపు
- అందులో 12వేలమంది భారతీయులు

**న్యూయార్క్, ఏప్రిల్ 1:**

అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ మంగళవారం ఒక్కసారిగా భారీ లేఆఫ్స్‌కు శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 1.62 లక్షల మంది సిబ్బందిలో 18 శాతం అంటే దాదాపు 30వేల మందిని తొలగించినట్లు సమాచారం. వీరిలో ఏకంగా 12వేల మంది భారత దేశానికి చెందినవారే కావడం గమనార్హం. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటలకు వేలాదిమంది ఉద్యోగులకు ఒకేసారి లేఆఫ్ మెయిల్స్ పంపారు. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వారి రోల్స్ అవసరం లేదని పేర్కొంటూ తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 31నే వారి చివరి పనిదినంగా ప్రకటించడంతోపాటు కంపెనీ ల్యాప్‌టాప్‌లు, సిస్టమ్‌ల యాక్సెస్‌ను వెంటనే నిలిపివేయడం ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ లేఆఫ్స్ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ఒరాకిల్ ఇండియాలో సుమారు 30వేల మంది పనిచేస్తుండగా వారిలో గణనీయమైన శాతం ఈ కోతలకు గురైనట్లు సమాచారం. అమెరికా, కెనడాలో తొలగించిన ఉద్యోగుల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయులే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేనేజీరియల్ స్థాయిలో ఉన్న ఉద్యోగులే ఎక్కువగా ఈ వేటుకు గురైనట్లు సమాచారం. ఇది ఒక్క విడత మాత్రమేనని, ఇంకా మరిన్ని లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందన్న వార్తలు ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతున్నాయి. ఏ సమయంలోనైనా మరో చేదు వార్త వినాల్సి వస్తుందేమోనని ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు. ఒరాకిల్ ప్రస్తుతం నష్టాల్లో లేదు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో కంపెనీ లాభాలు గత ఏడాదితో పోలిస్తే 95శాతం పెరిగి 6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, కంపెనీ ఇప్పుడు డేటా సెంటర్ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతోంది. సుమారు 156 బిలియన్ డాలర్ల ప్రాజెక్టు చేపట్టగా అందులో భాగంగా ఇప్పటికే 50 బిలియన్ డాలర్లు అప్పు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఖర్చులను తగ్గించేందుకు ఉద్యోగాల కోతలు విధిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్యల ద్వారా కంపెనీకి 10 బిలియన్ డాలర్ల వరకు ఆదా అవుతుందని అంచనా. ఇక తొలగించిన ఉద్యోగులకు కంపెనీ కొన్ని పరిహారాలు ప్రకటించింది. అదనంగా మూడు నెలల జీతం, కంపెనీలో పని చేసిన ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం, మిగిలిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం, కార్మిక చట్టాల ప్రకారం గ్రాట్యుటీ. అయితే, ఈ ప్రయోజనాలు కంపెనీ నిర్దేశించిన గడువులోపు రాజీనామా



## రేపు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

- 3వేల మంది పోలీసులతో బందోబస్తు

**హైదరాబాద్,ఏప్రిల్1:**

నగరంలో నిర్వహించనున్న హనుమత్ జయంతికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా శోభాయాత్ర నిర్వహించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. గురువారం హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించాక పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సుమారు 3వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ డియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్ అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోటర్ల శోభాయాత్ర మార్గాన్ని వాహనంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్లపై చెత్తాచెదారం, మట్టి కుప్పలు, రాళ్లు లేకుండా, రోడ్డుపైకి వచ్చే చెట్టుకొమ్మలు తొలగించే పనులు చేస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా యాత్ర జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## కేరళంలో సీఎం రేవంత్ రోడ్ షో

**హైదరాబాద్, ఏప్రిల్ 1:**

కేరళంలో ఎన్నికల ప్రచారంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. అక్కడి ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు బుధవారం రోడ్ షోలో పాల్గొని స్థానిక ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీకి, పినరయ్ విజయన్‌కు తేడా ఏమీ లేదని, కేరళం ప్రజలు తెలివైన వారు, విద్యాధికులని, కేరళం ప్రజలు మతతత్వ శక్తులను ఎప్పటికీ అనుమతించరని అన్నారు. మతతత్వ శక్తులు కేరళంలోకి ప్రవేశించకుండా ఇక్కడి ప్రజలు లక్ష్మణ రేఖ గీశారన్నారు. కానీ నరేంద్ర మోదీ.. పినరయ్ విజయన్ ద్వారా కేరళం భవిష్యత్‌ను అపహరించాలని చూస్తున్నారని విమర్శించారు. అందుకే బీజేపీ నాయకులు తమ ఓటు బ్యాంకును పినరయ్ విజయన్ కు బదిలీ చేయించేందుకు చూస్తున్నారని, కేరళంలో కాంగ్రెస్, మిత్రపక్షాలు



గెలవకూడదని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇది కేరళం ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం అని అన్నారు. పెట్టుబడులు తెచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించి కేరళంను అభివృద్ధి చేసేవారికే ఓటు వేయండి అని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.

# పొంగులేటి మైనింగ్ కథలో రాఘవ నీడలు !

**(ప్రత్యేక ప్రతినిధి - సిరిన్యూస్) :**

తెలంగాణకు గుండెకాయ వంటి హైదరాబాద్ మహానగరానికి తాగునీరు అందించే గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాలను కాపాడుకోవడానికి గత పాలకులు అత్యంత కఠినమైన జీవో 111ని తీసుకువచ్చారు. ఈ పరిధిలో ఎలాంటి కాలుష్యకారక పరిశ్రమలు, భారీ నిర్మాణాలకు తావులేదు. కానీ, ప్రస్తుత ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఈ జీవోను కేవలం ఒక కాగితం ముక్కగానే పరిగణించిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శంషాబాద్ మండలం, కొత్తవాల్‌గూడ పరిధిలోని సర్వే నంబర్ 62, 63లలో ప్రభుత్వం నిర్దేశించిన పర్యావరణ నిబంధనలను బేఖాతరు చేస్తూ, ఎకరాకు పైగా విస్తీర్ణంలో భారీ స్టోన్ క్రషర్‌ను ఏర్పాటు చేయడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

**రెండుసార్లు పట్టుబడ్డా తగ్గని తెగింపు...**

ఈ మైనింగ్ అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో మైనింగ్ శాఖ అధికారులు గతంలో రెండుసార్లు గత ఫిబ్రవరి 13, మార్చి 4 తేదీలలో తనిఖీలు నిర్వహించారు. ఆ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. అనుమతులు లేకుండానే సుమారు 11,200 మెట్రిక్ టన్నుల ముడి సరుకును తవ్వి తీసినట్లు అధికారులు రికార్డుల్లో నమోదు చేశారు. పర్యావరణానికి, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న ఈ ఉల్లంఘనపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి, కేవలం రూ.25 లక్షల నామమాత్రపు జరిమానాతో సరిపెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. మైనింగ్ చట్టం ప్రకారం ఏడాది జైలు శిక్ష విధించాల్సిన నేరానికి,



కేవలం పెనాల్టీ కట్టి మళ్లీ అదే చోట క్రషింగ్ కొనసాగించడం వెనుక ప్రభుత్వ పెద్దల పరపతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

**చట్టం కళ్లు గప్పి 'డీజిల్' దందా..**

సాధారణంగా ఏ భారీ పరిశ్రమకైనా గ్రిడ్ ద్వారా విద్యుత్ కనెక్షన్ పొందాలంటే కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) క్లియరెన్స్ తప్పనిసరి. అయితే, ఈ క్రషర్ అక్రమమని తెలిసినందువల్ల, అధికారులు విద్యుత్ సరఫరా చేసే అవకాశం లేదు. ఈ అడ్డంకిని అధిగమించడానికి రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పర్యావరణానికి మరింత హాని చేసే మార్గాన్ని ఎంచుకుంది. అత్యంత ఖరీదైన, శబ్ద కాలుష్యం కలిగించే భారీ డీజిల్ జనరేటర్లను ఉపయోగించి ఈ క్రషర్‌ను యథేచ్ఛగా నడుపుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రిడ్ కనెక్షన్ లేకపోయినా అధికార బలంతో ఇంత భారీ స్థాయిలో మైనింగ్ ప్రక్రియను కొనసాగించడం 'అంతుచిక్కని మైనింగ్ దందా'కు పరాకాష్టగా కనిపిస్తోంది. పర్యావరణ అనుమతులు లేవు.. పీసీబీ అనుమతులు లేవు.. అయినా అక్కడ యంత్రాలు నిరంతరం గర్జిస్తూనే ఉన్నాయి.

రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కేవలం ఒక సంస్థ కాదు, అది మంత్రి పొంగులేటి ఆర్థిక, రాజకీయ సామ్రాజ్యానికి మూలస్తంభమని, ఒక మంత్రి తన హోదాను అడ్డుపెట్టుకుని, అధికారులను ఒత్తిడికి గురి చేస్తూ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నట్లు ప్రతిపక్షాలు అసెంబ్లీలో దుమ్మెత్తిపోశాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, పర్యావరణ చట్టాలను తుంగలో తొక్కడం వెనుక కోట్లాది రూపాయల మైనింగ్ మాఫియా నడుస్తోందని, సామాన్య ప్రజానీకంలోనూ చర్చ సాగుతోంది. ప్రభుత్వం ప్రకటించిన సీబీసీఐడీ విచారణ కేవలం ఒక ఐవాష్‌గా మాత్రమే మిగిలిపోతుందా లేదా బాధ్యులపై చర్యలు తీసుకుంటుందా అన్నది తేలాల్సి ఉంది.

**అసెంబ్లీలో దద్దరిల్లిన సభ...**

ఈ వ్యవహారం అసెంబ్లీ సాక్షిగా ఒక యుద్ధానికి దారితీసింది. బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్ రావు ఆధారాలతో సహా సభను నిలదీశారు. రక్షకుడే భక్షకుడిగా మారిన దుస్థితి దాపురించింది అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించాయి. జీవో 111 పరిధిలో అక్రమంగా క్రషర్ నడుపుతూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ఆయన ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి రాజీనామా చేసి, ఈ అక్రమాలపై విచారణను ఎదుర్కోవాలని డిమాండ్ చేశారు. నేను చెప్పినవి అబద్ధాలైతే ఉరి తీయండి.. ఒకవేళ నిజమైతే మంత్రి రాజీనామా చేస్తారా? అని హరీశ్ రావు విసిరిన సవాల్ సభలో ఉద్రిక్తతను పెంచింది.

**కాంగ్రెస్ ప్రభుత్వం.. రక్షణ కవచం ?**

ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు ఈ అక్రమాలను ఒక స్థాయిలో ఒప్పుకుంటూనే, మంత్రిని వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. కంపెనీ తప్పు చేసింది కాబట్టే జరిమానా వేశామని చెప్తూ, ఈ వివాదాన్ని డైవర్ట్ చేయడానికి గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని మైనింగ్ లీజులపై సీబీసీఐడీ విచారణ జరిపిస్తామని ప్రకటించారు. అయితే, సిట్టింగ్ మంత్రికి చెందిన సంస్థ పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతుంటే విచారణ పేరుతో కాలయాపన చేయడం ఏమిటని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. అసెంబ్లీలో చర్చను పక్కదారి పట్టించేందుకు మార్షల్స్‌ను రంగంలోకి దింపడం, ప్రతిపక్ష సభ్యుల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇవ్వడమేనని విమర్శలు వస్తున్నాయి.

**తేలాల్సిన నిజాలు ఎన్నో..**

నిజాయితీగా పనిచేస్తున్నామని చెప్పుకునే కాంగ్రెస్ సర్కార్, సొంత మంత్రిపై వచ్చిన ఈ క్రషర్ బాంబ్ ఆరోపణల విషయంలో ఏ మేరకు వెనక్కి తగ్గుతుందో చూడాలి. హరీశ్ రావు డిమాండ్ చేసినట్లుగా సిట్టింగ్ జడ్జితో లేదా హౌస్ కమిటీతో విచారణ జరిపిస్తేనే, ఈ అంతులేని మైనింగ్ కథలోని అసలు దోషులు ఎవరో బయటపడతారు. అప్పటి వరకు పొంగులేటి అక్రమాల పరంపరపై సాగుతున్న ఈ పోరాటం రాష్ట్రస్థాయిలో రాజకీయ సెగలు పుట్టిస్తూనే ఉంటుంది.

## కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

- జీతాలు నేరుగా ఖాతాల్లో జమ చేయనున్న ప్రభుత్వం
- వేలాదిమంది ఉద్యోగులకు లబ్ది చేకూరే అవకాశం

**హైదరాబాద్,ఏప్రిల్1:**

తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ది చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే పక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. టార్గెట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే



## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం

- 29మంది దుర్మరణం చెందినట్లు ధ్రువీకరణ

**మాస్కో, ఏప్రిల్ 1:**


క్రిమియాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. రష్యాకు చెందిన సైనిక విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో 29 మంది దుర్మరణం చెందారు. ఆంటోనోవ్ 26 మోడల్‌కు చెందిన విమానం స్థానిక కాలమాన ప్రకారం మంగళవారం సాయంత్రం 6 గంటలకు క్రిమియా ద్వీపకల్పం మీదుగా వెళ్తోంది. అదే సమయంలో ఆ విమానానికి రాడర్‌తో సంబంధాలు తెగిపోయాయి. అయితే ఆ విమానం ఒక కొండను ఢీకొని కూలిపోయినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో విమానంలో 23 మంది సైనికులు, ఆరుగురు సిబ్బంది ఉండగా వారందరూ మృతిచెందారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సాంకేతిక సమస్య కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమిక అంచనా వేసింది. విమానంపై దాడి జరిగింది అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపింది. ప్రమాదానికి గురైన ఆంటోనోవ్ ఎన్ 26 విమానాలను 1960 చివరలో ప్రవేశపెట్టారు. వీటిని సైనిక అవసరాలతో పాటు సరకు రవాణాకు ఉపయోగిస్తుంటారు. అయితే ఈ మోడల్‌కు చెందిన విమానాలు గత కొన్నేళ్లుగా ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇదే ఏడాది దక్షిణ సూడాన్‌లో జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. 2022లో ఉక్రెయిన్‌లో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా 2020లో శిక్షణ విమానం కూలి 20 మంది మరణించారు.

## కొత్తగా నమోదు చేసుకున్న రైతులకు ఊరట

- వారికి కూడా 'రైతుభరోసా'

**హైదరాబాద్, ఏప్రిల్ 1:**

రాష్ట్రంలోని కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులకు రేవంత్ సర్కార్ భారీ ఊరటనిచ్చింది. ఇప్పటివరకు పాత లబ్దిదారులకే పరిమితమైన రైతు భరోసా పథకాన్ని కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టా పొందిన రైతులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పట్టా పొందిన సుమారు 85 వేల మంది రైతులు ఉన్నారని అంచనా వేయగా, వారిలో ఇప్పటికే 62 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను వ్యవసాయ శాఖ ప్రస్తుతం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. రైతుల అర్హత, భూమి వివరాలు, పట్టాదారుల నిజానిజాలను నిర్ధారించిన తర్వాత వారం, పది రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. అర్హులుగా తేలిన కొత్త రైతులకు ఏప్రిల్ 1520 తేదీల మధ్య యాసంగి రెండో





విడత రైతు భరోసా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ సీజన్‌లో సుమారు రూ.9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత వానాకాలం సీజన్‌లో లబ్ది పొందిన ప్రతి రైతుకు ఈ యాసంగిలో కూడా కోతలు లేకుండా పూర్తిస్థాయి పెట్టుబడి సాయం అందనుంది. 2025`26 ఖరీఫ్‌లో సుమారు 69.39 లక్షల మంది రైతులకు ఎకరానికి రూ.6,000 చొప్పున మొత్తం రూ. 8,744.13 కోట్లను కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే పంపిణీ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించింది. రైతు భరోసా లబ్దిదారుల సంఖ్యలో నల్లగొండ జిల్లా 5.22 లక్షల మందితో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో సంగారెడ్డి (3.53 లక్షలు), ఖమ్మం (3.35 లక్షలు),

## మంత్రి పొంగులేటిని సీఐడి ప్రశ్నించగలదా?

- ఆ విచారణలో తేలేదేమీ ఉండదు
- కడియం ఏ పార్టీలో ఉన్నారో తెలపాలన్నాం
- వీటి గురించి మాట్లాడితే కేసులతో వేధింపులా?
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 1:**

రాష్ట్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ స్కామ్‌ను తమ పార్టీ నేత హరీశ్‌రావు అసెంబ్లీలో ఆధారాలతో బయటపెట్టారని, దీనిపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశామని, హౌస్ కమిటీ వేయడానికి సీఎం రేవంత్ రెడ్డికి ఏం సమస్య అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ దీనిపై సీఐడీ దర్యాప్తు చేయిస్తామని ప్రభుత్వం చెబుతోందని, సీఐడీ అధికారులు మంత్రిని ప్రశ్నించే అవకాశం ఉంటుందా అని నిలదీశారు. అందుకే పొంగులేటిని మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశామన్నారు. కాగా, పార్టీ ఫిరాయించిన దానం నాగేందర్, కడియం శ్రీహరిలతో ముఖ్యమంత్రి మాట్లాడించారని, నాగేందర్ నోటికొచ్చినట్లు మాట్లాడి బెదిరించారని ఆయన తెలిపారు. కడియం బీఆరఎస్‌లో ఉంటే అన్నం పెట్టిన కేసీఆర్, హరీశ్‌రావును విమర్శించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ వాళ్ల దగ్గర ఎందుకు కూర్చున్నావు, ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నావంటూ తనతోపాటు బీఆర్ఎస్ సభ్యులందరం ప్రశ్నించడం తప్పా అని అడిగారు. ప్రజల పక్షాన నిలబడినందుకు తనను కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరూ టార్గెట్ చేశారని ఆరోపించారు. నిరుద్యోగుల పక్షాన ఉద్యోగాలు అడిగినందుకా, పెన్షన్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నించినందుకా తనను ఎందుకు టార్గెట్ చేస్తున్నారని నిలదీశారు. అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు మాట్లాడిన బూతులు అందరూ విన్నారని, ఎథిక్స్ కమిటీకి వారి తిట్లు వినిపించవా అని ప్రశ్నించారు. హామీలపై మేం ప్రశ్నిస్తే మమ్మల్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి అవినీతిని బయటపెడితే ప్రభుత్వం స్పందించడం లేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్ మండిపడ్డారు. మైనింగ్‌పై అవినీతిపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. నిజమైన నాయకులంటే పార్టీ లైన్‌లో ఉండాలి.. కానీ పార్టీ మారిన మనిషిని మీ భుజాల మీద ఎందుకుఎత్తుకుంటున్నారని మండిపడ్డారు. తోటి శాసనసభ్యుడిని తిట్టేందుకు మంత్రులకు మైక్‌లు ఇచ్చారన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు ఒక్కరైనా స్జబెక్ట్ మాట్లాడారా, స్వర్ణకారుల కష్టాల గురించి ఒక్కరైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. అవినీతి మంత్రిని, పార్టీ మారిన వ్యక్తిని వెనుకేసుకొచ్చారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయితే కడియం మా వెనుకాల కూర్చోవాలి



కానీ అలాంటి నాయకుడిని మీరు వెనుకేసుకొస్తారా అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో పాలసీల గురించి మాట్లాడుతున్నామా అంటూ మనం చర్చించాల్సింది ప్రజల సమస్యల గురించి మాత్రమే అని స్పష్టం చేశారు



## వేసవి మంట భరించాల్సిందే

- మూడు నెలలు ఎండలు, వడగాడ్పులు
- భారత వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 1:

రాష్ట్రంలో ఈ వేసవి సీజన్ మొత్తం ఎండ మంట పుట్టించనుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని వాతావరణ వాఖ హెచ్చరించింది. రానున్న మూడు నెలలకు దేశంలో వాతావరణ పరిస్థితులు, ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బులెటిన్ విడుదల చేసింది. వచ్చే మూడు నెలలు రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారే అవకాశం ఉంది. ఏపీతో పాటు ఒడిశా, తెలంగాణలో కొంత భాగం, పశ్చిమ బెంగాల్, బిహార్, యూపీ, ఈశాన్య రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదుకానున్నాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదవుతాయి. ఈ మూడు నెలల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. ఏప్రిల్‌లో సగటున మూడు, నాలుగు రోజులు, మే, జూన్ నెలల్లో పది, అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉండనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఏప్రిల్‌లో ఈశాన్య రాష్ట్రాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కానుంది. మార్చిలో సాధారణ వర్షపాతం 29.9 మిల్లీవి□టర్లకుగాను 33.7 మిల్లీవి□టర్లు నమోదైంది. 1901 నుంచి ఇప్పటి వరకు మార్చిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవడం ఇది 32వ సారి. పసిఫిక్ మహాసముద్రంలో లానినా చివరి దశకు చేరుకుంది. కొద్ది రోజుల్లో తటస్థ పరిస్థితులకు చేరుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ మోడల్స్ వెల్లడిస్తున్నాయి. దీనికనుగుణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని, జూన్ (నైరుతి రుతుపవనాల ప్రారంభం) నుంచే ఎల్‌నినో మొదలవుతుందని ఐఎండీ



## క్షీణిస్తున్న ఆత్మీయ అనుబంధాలు

మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. మన సంస్కృతిలో ఒకప్పుడు కుటుంబ గౌరవం కోసం త్యాగాలు చేసిన ఉదాహరణలు ఉన్నాయని, శ్రీరాముడు తన తండ్రి మాట కోసం అడవులకు వెళ్లిన సంఘటనను గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం ప్రేమానురాగాలకంటే సంపాదనపై మోజు పెరిగి ఆస్తి వివాదాల కారణంగా సొంత వారిలోనే ద్వేషాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం వల్ల సమాజంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆయ న అభిప్రాయపడ్డారు. గతంలో కుటుం బంలో పెద్దలు ఉండి సమస్యలను పం చుకునే అవకాశం ఉండేదని, ఇప్పుడు ఏకాకి జీవన విధానం కారణంగా చిన్న సమస్యలకే మనసు బలహీనపడుతోందని తెలిపారు. అప్పులు, చిన్నపాటి మనస్పర్థలు ప్రాణాలు తీసుకునేంత పెద్దవి కావని, అందరూ కలిసి ఉంటే ఏ సమస్యనైనా పరిష్కరించవచ్చని గ్రామస్తులకు సూచించారు. అలాగే శాస్త్రీయ ప్రగతి (సైన్స్ ప్రోగ్రెస్) ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కరించడంలో లోపాలు ఉన్నాయని చెప్పారు. నింగిలోకి శాటిలైట్లు పంపుతున్నప్పటికీ, నదీ జలాలను పంట పొలాలకు మళ్లించలేక పోతున్నామని పేర్కొన్నారు. రైతులకు భరోసా కల్పించడం అత్యవసరమని నొక్కి చెప్పారు. కుటుంబ, నైతిక విలువలు తగ్గిపోవడం వల్ల సామాజిక సంఘర్షణ (సోషియల్ కానిక్ట్), సామాజిక అశాంతి (సోషియల్ అన్రెస్ట్) పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సమాజంలో ఉన్న సామాజిక రుగ్మతలను తొలగించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభాతభేరి అనే సామాజిక చైతన్య కార్యక్రమాన్ని రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు.



## ఆరు గ్యారెంటీలపై నిలదీయండి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్1:

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ఆరు గ్యారంటీల అమలులో అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిపై నిరసన తెలుపుతూ నిలదీయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పార్టీ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముందుగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లయినా ఇంతవరకు అమలు చేయకుండా మోసం చేస్తున్నదని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వేలో బూత్ స్థాయి కార్యకర్తలు బీఎల్వోలతో కలిసి ఇంటింటికి వెళ్లి బోగస్ ఓటర్లను ఏరివేయడంలో సహకరించాలన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు ఎప్పుడైనా వచ్చే అవకాశమున్నందున పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# కాజీపేట రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలి

- పెద్దపల్లి-నిజామాబాద్ సెక్షన్‌ను బదిలీ చేయొద్దు
- రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు లేఖ రాసిన కేటీఆర్
- మంత్రికి అందచేసిన బీఆర్ఎస్ ఎంపీలు
- సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి

హైదరాబాద్, ఏప్రిల్ 1:

సికింద్రాబాద్ డివిజన్‌పై ఉన్న భారం వల్ల నిర్ణయాల్లో జాప్యం, భద్రతా పర్యవేక్షణలో సవాళ్లు ఎదురవుతున్నందున కాజీపేట డివిజన్ ఏర్పాటుతో వికేంద్రీకరణ జరుగుతుందని, తద్వారా ఉత్తర, తూర్పు తెలంగాణ ప్రాంతాల్లో రైల్వే సేవలు మెరుగుపడటమే కాక సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు లేఖ రాశారు. కేవలం 900 కి.మీ పరిధి ఉన్న గుంటూరును ప్రత్యేక డివిజన్ గా ఏర్పాటు చేసిన అంశాన్ని ప్రస్తావించిన కేటీఆర్ కాజీపేట కేంద్రంగా నూతన రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ లేఖను పార్టీ ఎంపీల బృందం ఈ రోజు కేంద్ర మంత్రికి స్వయంగా అందజేశారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. దక్షిణ మధ్య రైల్వేలో జరుగుతున్న అంతర్గత పునర్వ్యవస్థీకరణ, దక్షిణ తీర రైల్వే కార్యకలాపాల ప్రారంభం వల్ల సికింద్రాబాద్ డివిజన్‌పై పనిభారం విపరీతంగా పెరిగిందని కేటీఆర్ తన లేఖలో ఎత్తిచూపారు. తాజా గణాంకాల ప్రకారం ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్ పరిధి 2,755 ట్రాక్ కిలోమీటర్లుగా ఉందని, రాబోయే కాలంలో వాడిరాయచూర్ మరియు విష్ణుపురంబీబీనగర్ డబ్లింగ్ పనులు పూర్తయితే ఇది సుమారు 3,150 కిలోమీటర్లకు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఇది భారతీయ రైల్వేల పరిపాలనా ప్రమాణాల ప్రకారం ఒక డివిజన్‌కు ఉండాల్సిన పరిమితి కంటే చాలా ఎక్కువని వివరించారు. మిగతా డివిజన్లతో పోలిస్తే సికింద్రాబాద్‌పై ఉన్న ఒత్తిడిని కేటీఆర్ వివరిస్తూ విజయవాడ, గుంతకల్ డివిజన్లు సుమారు 2,200 ట్రాక్ కిలోమీటర్ల పరిధిని కలిగి ఉండగా, గుంటూరు డివిజన్ కేవలం 900 కిలోమీటర్ల లోపే ఉందని గుర్తుచేశారు. అనేక చోట్ల ప్రతిపాదిత కాజీపేట డివిజన్ కన్నా తక్కువ కిలోమీటర్లు ఉన్న డివిజన్లను ఏర్పాటు చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ భారీ అసమతుల్యత వల్ల సికింద్రాబాద్ డివిజన్ నిర్వహణ అత్యంత సంక్లిష్టంగా మారిందని, ఇది రైళ్ల రాకపోకల సాంద్రతపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే కాజీపేట కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయడం అటు పరిపాలన సౌలభ్యం, ఇటు కార్యకలాపాల రీత్యానూ అత్యంత అవసరమని స్పష్టం చేశారు. ప్రతిపాదిత కాజీపేట డివిజన్‌లో కాజీపేట-బల్లార్షా, పెద్దపల్లి-నిజామాబాద్, కాజీపేట-ఎర్రుపాలెం, డోర్నకల్-మణుగూరు & సత్తుపల్లి వంటి కీలక మార్గాలను చేర్చడం ద్వారా సుమారు 2,000 కి.మీ నెట్‌వర్క్‌ను సమర్థవంతంగా నిర్వహించవచ్చని సూచించారు. రైల్వే శాఖ ప్రస్తుతం పరిశీలిస్తున్న కొన్ని మార్పులపై కూడా కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పెద్దపల్లి నిజామాబాద్ సెక్షన్‌ను హైదరాబాద్ డివిజన్‌కు బదిలీ చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, భౌగోళిక సామీప్యత దృష్ట్యా దానిని కాజీపేట డివిజన్‌లోనే ఉంచాలని డిమాండ్ చేశారు. లాతూర్ రోడ్‌పర్లీ వైజనాథ్ సెక్షన్‌ను నాందేడ్ డివిజన్‌కు మార్చే అంశాన్ని కూడా పునఃపరిశీలించాలని విన్నవించారు. కాజీపేట ప్రధాన రైలు మార్గాల కూడలిలో ఉండటం, అక్కడ ఇప్పటికే



రైల్వే తయారీ యూనిట్, మహబూబాబాద్‌లో మెయింటెనెన్స్ కేంద్రాల అభివృద్ధి జరుగుతున్నందున ఈ ప్రాంతం జాతీయ స్థాయిలో కీలక రైల్వే హబ్‌గా మారుతుందని పేర్కొన్నారు. సింగరేణి బొగ్గు, సిమెంట్, ఎరువులు, ఆహార ధాన్యాల రవాణా ద్వారా రైల్వేకు ఈ ప్రాంతం నుండి భారీ ఆదాయం లభిస్తుందని, ఇంతటి ప్రాధాన్యత ఉన్న మార్గాలపై ప్రత్యేక పరిపాలనా పర్యవేక్షణ ఉండాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. చివరగా,భారతీయ రైల్వేల సంస్థాగత బలోపేతానికి, తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను నెరవేర్చడానికి ఈ డివిజన్‌ను తక్షణమే ఆమోదించాలని కేటీఆర్ కేంద్రాన్ని కోరారు.

## గల్ఫ్ కార్మికుడికి నష్టపరిహారం కోసం వినతి

- ప్రజావాణిలో సానుకూల స్పందన

హైదరాబాద్, ఏప్రిల్ 1:

గల్ఫ్ లో పనిచేస్తున్న ఒక కార్మికుడు అపస్మారక స్థితిలో ఇక్కడకు వచ్చి మరణించడంతో నష్టపరిహారం అందక ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రభుత్వం జి.ఓ. నెం.216 ప్రకారం గల్ఫ్ దేశాల్లో మరణించిన వలస కార్మికుల కుటుంబాలకు ₹5 లక్షల ఎక్స్ గ్రేషియా అందజేస్తోంది. అయితే ఈ కేసులో మరణం భారత్‌లో చోటుచేసుకోవడంతో 'మరణ స్థలం గల్ఫ్ దేశం అయి ఉండాలి' అనే సాంకేతిక నిబంధన కారణంగా ఆర్థిక సహాయం పొందడంలో ఆటంకం ఏర్పడుతోంది. జగిత్యాల జిల్లా, జగిత్యాల రూరల్ మండలం, పొలాస గ్రామానికి చెందిన ఆరెల్లి గంగారాజం (61) కిడ్నీ సంబంధిత వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురై, 2025 నవంబర్ 12న దుబాయిలోని ఆస్టర్ హాస్పిటల్‌లో కోమా స్థితిలో చేర్చారు. మెరుగైన చికిత్స కోసం డిసెంబర్ 14న హైదరాబాద్‌కు తరలించి, నిమ్స్‌లో చేర్చారు. అనంతరం రీహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతూ, చివరకు జగిత్యాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డిసెంబర్ 24న మరణించారు. మానవతా దృక్పథంతో ప్రత్యేక కేసుగా పరిగణించి ₹5 లక్షల గల్ఫ్ ఎక్స్ గ్రేషియా మంజూరు చేయాలని మృతుడి భార్య రాజవ్వ, కుమారుడు జలంధర్ మంగళవారం హైదరాబాద్ బేగంపేటలోని ప్రజాభవన్‌లో



నిర్వహించిన "సీఎం ప్రవాసీ ప్రజావాణి" కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేరిట వినతిపత్రం సమర్పించారు. జగిత్యాల ఎమ్మెల్యే డా. మాకునూరి సంజయ్ కుమార్‌కు దరఖాస్తు ప్రతిని పంపించారు. ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి సహకారంతో, వారు ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్ లను కలిసి తమ సమస్యను వివరించారు. వారు ఈ అంశంపై సానుకూలంగా స్పందించారు. ప్రత్యేక కేసుగా పరిగణించి గల్ఫ్ ఎక్స్ గ్రేషియా మంజూరును పరిశీలించాలని ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి. శేషాద్రిని ఆదేశిస్తూ డా. జి. చిన్నారెడ్డి దరఖాస్తుపై ఎండార్స్ చేశారు. నిబంధనల ప్రకారం సాధ్యం కాని పరిస్థితిలో, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా ఆర్థిక సహాయం అందించే అవకాశాన్ని పరిశీలిస్తామని ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి డి.ఓ. లేఖ రాస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని, ప్రవాసీ ప్రజావాణి హెల్ప్ డెస్క్ ను సందర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ లకు వారు విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ కార్మికులు, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఛైర్మన్, అంబాసిడర్ డా. బి.ఎం.వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, సీఎం ప్రవాసీ ప్రజావాణి కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి, హెల్ప్ డెస్క్ వలంటీర్లు మహ్మద్ బషీర్ అహ్మద్, భార్గవి నద్దునూరి తదితరులు పాల్గొన్నారు.



## సోషల్ మీడియా పోస్టులపై ఆంక్షలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:

సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ చేయనుంది. అలాగే ఆ పోస్ట్‌ను షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిటి కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకువస్తుంది. అందుకోసం ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్‌డియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్ట పరమైన శిక్షలు తప్పవు.ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే అవకాశం ఉంది. ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్ల, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ డియా ఇన్‌ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది. ఏమైనా అభ్యంతరకర పోస్టులు పెడితే.. నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనలతోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

## రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల..

హైదరాబాద్, ఏప్రిల్ 1:

జోగులాంబ గద్వాల జిల్లాలోని నిరుద్యోగులకు , అర్హులైన అభ్యర్థులకు పౌర సరఫరాల శాఖ ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. జిల్లాలోని వివిధ మండలాల్లో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ల నియామకానికి అధికారికంగా నోటిఫికేషన్ వెలువడింది. దీనికి సంబంధించిన వివరాలను రెవెన్యూ డివిజనల్ అధికారి (RDO) శ్రీనివాసరావు బుధవారం మీడియాకు వెల్లడించారు.

**ఖాళీలు ఉన్న గ్రామాల వివరాలు..**


ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 8 మండలాల్లోని 14 గ్రామాల్లో ఎఫ్.పి.ఎస్ (FPS) డీలర్ల భర్తీ చేపట్టనున్నారు. అలంపూర్ మండలంలో అలంపూర్, క్యాతూర్.. ఉండవెల్లి మండలంలో బోన్కూర్, మానోపాడు మండలంలో.. చందూరు, నారాయణపూర్. అయిజ మండలంలో జడదొడ్డి, కూడకనూరు, అయిజ.. రాజోలి మండలంలో పడమటిగార్లపాడు, పచ్చర్ల.. వడ్డేపల్లి మండలంలో పైపాడు.. ఎర్రవల్లి మండలంలో వల్లూరు, రాజశ్రీ గార్లపాడు.. ఇటిక్యాల మండలంలో మొగిలిరావలచెరువు గ్రామల్లో ఈ రేషన్ డీలర్ల ఖాళీలు ఉన్నాయి. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా ఆయా గ్రామాలకు చెందిన స్థానిక నివాసితులై ఉండాలి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత విద్యార్హతలు కలిగి ఉండటంతో పాటు, రిజర్వేషన్ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ఎంపిక ప్రక్రియలో పారదర్శకత కోసం ప్రభుత్వం నిర్దేశించిన రోస్టర్ పద్ధతిని అనుసరిస్తారు.

# భూభారతి పోర్టల్‌తో తొలి అడుగు

- రేపటి నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా..
- స్మార్ట్ ఫోన్‌తో ఇంటినుంచే భూ సేవల లభ్యత
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 1:

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు రెవెన్యూ శాఖలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కేరళం పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాసరెడ్డి ఈ పోర్టల్ ప్రారంభానికి సంబంధించి రెవెన్యూ అధికారులతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను తయారు చేశామన్నారు. ఈ పోర్టల్‌ను ఈనెల 2నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి భూ వివాదాల పరిష్కారానికి తొలి అడుగు వేయబోతున్నామని వెల్లడించారు. వచ్చే ఫలితాలనుబట్టి అవసరమైన మార్పులు చేర్పులు చేసి భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ పోర్టల్‌ను రైతు కోణంలో రూపొందించామన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లు పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గతంలో మాదిరి రైతులు తమ భూ సేవల కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా తన ఇంటి నుంచే భూ సేవలు పొందేలా పోర్టల్‌ను రూపొందించామన్నారు. రైతులు తమ భూమి హద్దులు తేల్చాలని సర్వే అధికారుల చుట్టూ తిరిగేవారని, ఇప్పుడు ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి నుంచే భూభారతి పోర్టల్ ద్వారా పొందవచ్చని చెప్పారు. రైతు లాగిన్



అయిన వెంటనే భూమి వివరాలు కనిపిస్తాయని, ఎన్ని ఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు ఫీజు ఎంత చెల్లించాలో కనిపిస్తుందని అన్నారు. ఫీజు చెల్లించిన తర్వాత ఆ వివరాలు గ్రామంలో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ లాగిన్‌కు వెళుతుందని, రెండు రోజల్లో ఆ రైతు భూమికి ఆనుకొని ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తారని, తర్వాత ఏడు రోజుల్లోపు సర్వే తేదీని సర్వేయర్ ఖరారు చేయడమేగాక రోవర్లతో సర్వే పూర్తి చేస్తారని ఆయన వివరించారు. దీనిని సిస్టమ్‌లో నమోదు చేశాక అది మండల సర్వేయర్ స్క్రూటినీకి వెళుతుందని, ఆపై తహసీల్దార్ ఆమోదం పొందాక దరఖాస్తుదారుకు ఎల్‌పిఎమ్, భూధార్ నెంబర్‌ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ఈ వివరాలు భూభారతి పోర్టల్‌లో కూడా నిక్షిప్తమవుతాయని, సర్వే తర్వాత సర్వే మ్యాప్‌ను జనరేట్ చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ దరఖాస్తు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేవరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు ఎస్ఎమ్ఎస్ అలర్ట్స్ పంపిస్తారన్నారు. వ్యవసాయ భూములకు సంబంధించి క్రయవిక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నామని, ప్రతి సర్వే మ్యాప్ (ఎల్‌పిఎమ్) యూనిక్ నెంబరు, ప్రతి సర్వే నెంబర్‌కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని వెల్లడించారు. ఐదు మండలాల్లో రైతులు దరఖాస్తు చేసుకున్న తర్వాత సర్వే కోసం సర్వేయర్లను అందుబాటులో ఉంచామని, గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత పరికరాలకు స్వస్తి చెప్పి రోవర్లతో సర్వే నిర్వహిస్తామని తెలిపారు. దీనివల్ల సర్వే త్వరితగతిన పూర్తవుతుందని, కచ్చితమైన వివరాలు వస్తాయని మంత్రి పొంగులేటి

# బంగారు ఉంగరాన్ని అప్పగించిన హోంగార్డు ధర్మేందర్

## హోంగార్డు నిజాయితీకి అభినందించిన ఎస్ఐ



**అందోలు, ఏప్రిల్ 01, (సిరి న్యూస్):**

జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు తోడేటి ధర్మేందర్‌కు బుధవారం అరతులం బంగారు ఉంగరం (రూ.70వేల విలువ) లభించింది. ఈ బంగారం ఎవ్వరిదని ఆరా తీయగా ఇద్దరు మహిళలు తనదేనంటూ హోంగార్డు వద్దకు వచ్చారు. ఉంగరం ఎలా ఉంది? దానికి ఎన్ని రాళ్లు ఉన్నాయి? ఏ ఆకారంలో ఉందంటూ ప్రశ్నించి వీటన్నింటికి స్టేషన్‌కు వచ్చి సమాదానం ఇచ్చి ఉంగరాన్ని తీసుకువెళ్లాలని సూచించారు. దీంతో ఆ ఇద్దరు మహిళలు వెనక్కి వెళ్లి పోయారు. ఎలాగైన బంగారు ఉంగరాన్ని కాజేద్దామనుకున్న మహిâ¶ లను స్టేషన్‌కు రావాలని కోరడంతో భయపడి వెళ్లిపోయారు. దీంతో తనకు దొరికిన ఉంగరాన్ని నిజాయితీగా హోంగార్డు ఎస్ఐ దుర్గయ్యకు అప్పగించారు. చాలా సంవత్సరాలుగా బస్టాండ్‌లో విధులు నిర్వహించే హోంగార్డు ధర్మేందర్ పలు సార్లు బస్టాండ్‌లో లభించిన వస్తువులను భాదితులకు అప్పగించడమే కాకుండా ప్రయాణీకులకు ఎన్నో రకాలుగా సహకరించిన సందర్భాలున్నాయి. డ్యూటీనే నమ్ముకొని పనిచేస్తున్న హోంగార్డు నిజాయితీకి పోలీసు అధికారులు, ఆర్టీసీ సిబ్బంది అభినందించారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన మాజీ చైర్మన్





**అమీన్ పూర్ ఏప్రిల్ 1 సిరి న్యూస్**

అమీన్ పూర్ జిహెచ్ఎంసి కేజీఆర్ సర్కిల్ దగ్గర చలివేంద్రానికి ప్రారంభించిన మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మండుటెండల నుంచి ప్రజల పశమనం కలిగించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా పాదచారులు కార్మికులు వాహనదారులకు చల్లని త్రాగునీరు అందించే గొప్ప ఆలోచన మంచిదని ప్రశంసించారు. వేసవి కాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు అవసరమని అన్నారు. వేసవి కాలం మొత్తం చలివేంద్రం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న సన్నిధిలో పూజార్చనలు చేసిన కాంగ్రెస్ నేతలు



**మునిపల్లి ఏప్రిల్ 1 (సిరి న్యూస్)**

మునిపల్లి మండల పరిధిలోని కంకోల్ మగుదంపల్లి గ్రామంలో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం నాడు దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో జరుగిన ప్రత్యేక పూజల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సతీష్, ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్ మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శి నర్సింలుతో పాటు పార్టీ నాయకులు విట్టల్ రెడ్డి, వేంపల్లి నాగిశెట్టి, బైకడి ఈశ్వరప్ప, మరుపల్లి మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడులు కార్మికుల మెడకు ఉరి తాళ్ళు

- బ్లాక్ డే సందర్భంగా నిరసన ర్యాలీ.
- పెబ్ పెన్నార్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్.




**సదాశివపేట. ఏప్రిల్ 1. (సిరి న్యూస్)**

దేశంలో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడులు అమలు అయితే కార్మికుల మెడకు ఉరితాడులా మారుతాయని, తక్షణమే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోట్లు రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని పెబ్బ పెన్నార్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ అన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం బ్లాక్ డే సందర్భంగా ఆత్మకూర్ మద్దికుంట చౌరస్తాలో ప్లే కార్డ్స్ పట్టుకొని నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి వి ప్రవీణ్ కుమార్ హాజరై మాట్లాడుతూ సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నేడు బ్లాక్ డే సందర్భంగా కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ రద్దు చేయాలని బ్లాక్ డేగా నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేయడం ద్వారా కార్మికులకు పూర్తిస్థాయి బానిసలుగా మార్చేందుకు, పెట్టుబడుదాలకు ఊడిగం చేసేందుకు లేబర్ కోర్టులు తెచ్చిందన్నారు. కార్మికులకు నష్టం తెచ్చే ఈ లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న గుప్పెడు మంది పెట్టుబడుదాల కోసం కొట్లాను కోట్ల మంది కార్మిక వర్గాన్ని బలి చేయడం సరైనది కాదన్నారు. కార్మిక చట్టాలను నియంతృత్వంగా దౌర్జన్య పూర్తంగా కేంద్ర ప్రభుత్వం తమ తన చేతుల్లోకి తీసుకొని మార్చివేసింది ఇది రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసే రాజ్యాంగ వ్యతిరేక చర్య అని అన్నారు. బ్రిటిష్ కాలంలో బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్న ట్రేడ్ యూనియన్ చట్టం 1926 ప్రకారం యూనియన్ల ఏర్పాటు కార్మిక హక్కుగా పొందారు. కానీ లేబర్ కోడ్ తో కార్మికుల సంఘం పెట్టుకుని హక్కు సంఘటితమైన హక్కు నిరసనలు సమ్మె చేసే హక్కులపై ఉక్కు పాదం మోపారు. ఉద్యోగ భద్రత పట్ల యజమానులకు అన్ని బాధ్యతలను తొలగించారు. 8 గంటల పని విధానానికి తూట్లు పొడిచే పద్ధతి ఉందన్నారు తక్షణమే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మల్లేశం, పెబ్బ పెన్నార్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నీలం మల్లేశం, నాగరాజు, శ్రీరామ్ మూర్తి ,జావిద్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

- మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్
- రెండవ వార్డులో బోరు ఏర్పాటుకు శంకుస్థాపన

**గుమ్మడిదల, ఏప్రిల్1( సిరి న్యూస్)**



గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డులో ప్రజల తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు బోరు ఏర్పాటు పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ సరెడ్డి గారి పద్మా వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, కమిషనర్ దశరథ్ ముఖ్య అతిథులుగా హాజరై బోరు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలకు తాగునీరు అందించడం మున్సిపాలిటీ ప్రధాన బాధ్యతలలో ఒకటని తెలిపారు. రెండవ వార్డులో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ బోరు ఏర్పాటు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ పనుల ద్వారా స్థానిక ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగి, సౌకర్యవంతమైన జీవనం సాగించేందుకు సహకారం అందుతుందని తెలిపారు. అలాగే గ్రామంలోని ప్రతి వార్డులో ప్రజల అవసరాలను గుర్తించి తగిన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. నీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. అధికారులు పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు మాధవి, ప్రమీల, నరేందర్ రెడ్డి, రమేష్, కుమార్ గౌడ్, రాజశేఖర్, మురళి, నాయకులు వెంకట్రాంరెడ్డి, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అమ్మగారి వెంకట్ రెడ్డి, ముత్యాల రంగారెడ్డి, హుస్సేన్, శేఖర్ రెడ్డి, ఆంజనేయులు యాదవ్ తదితరులు, వివిధ పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# నిజాంపేట మండలంలో 'మిషన్ భగీరథ' సమ్మర్ స్పెషల్ డ్రైవ్







- తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు: ఎస్.ఈ. రఘువీర్

**రామాయంపేట, (నిజాంపేట) ఏప్రిల్ 1 (సిరి న్యూస్)**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వేసవి కాలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు చేపట్టిన 'సమ్మర్ స్పెషల్ డ్రైవ్' కార్యక్రమంలో భాగంగా బుధవారం మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని బచ్చురాజుపల్లి, నిజాంపేట గ్రామాల్లో మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. మిషన్ భగీరథ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్.ఈ.) రఘువీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈ.ఈ.) సంపత్ కుమార్‌తో కలిసి బచ్చురాజుపల్లిలో జరుగుతున్న హ్యాండ్ పంపుల మరమ్మత్తులను పర్యవేక్షించారు. అనంతరం నిజాంపేట గ్రామంలో తాగునీటి పైపులైన్ల రిపేరు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్.ఈ. రఘువీర్ మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఈ ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టిందని తెలిపారు. ఎక్కడైనా హ్యాండ్ పంపులు పనిచేయకపోతే వెంటనే మరమ్మత్తులు చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా సింగిల్ ఫేస్, త్రి ఫేస్ మోటార్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, అవసరమైన చోట వెంటనే రిపేర్లు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏ.ఈ.) బిక్షపతి, స్థానిక గ్రామ సర్పంచ్, మిషన్ భగీరథ హెల్పర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ ఒకలా.. ఆఫీస్‌లో మరోలా.. నార్సింగి లో పన్నుల మోసం

- రసీదుల్లో ఒక మొత్తం.. ఆన్లైన్‌లో తక్కువగా నమోదు
- ప్రశ్నించిన ప్రజలపై దురుసు ప్రవర్తన, కేసుల బెదిరింపులు
- ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అక్రమాలు
- దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్





**నార్సింగి, ఏప్రిల్ 1 (సిరి న్యూస్) :**

"దేశ అభివృద్ధిని చూడాలంటే గ్రామాల అభివృద్ధిని చూడాలి" అన్నది నానుడి. ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు 2018లో పంచాయతీ కార్యదర్శి వ్యవస్థను ప్రవేశపెట్టి, పన్నుల వసూళ్లు, అభివృద్ధి పనులు, పాలనా సౌలభ్యం వంటి అంశాలతో పాటు కార్యాలయ వ్యవస్థను పటిష్టం చేసింది. గ్రామాలలో చిన్న, పెద్ద పనులకు, సిబ్బంది జీతాలతో సహా పలు అవసరాల కోసం ఇంటి, వాణిజ్య, వ్యాపార సముదాయాలపై పన్నులు కీలకం. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలకు ముందు దాదాపు రెండు సంవత్సరాలు సర్పంచులు లేకపోవడంతో కేంద్రం నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులు అందక పోయిన సందర్భంలో, పన్నుల రూపంలో వచ్చిన నిధులే గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆధారంగా నిలిచాయి. ఇటీవల కాలంలో పంచాయతీ పన్నుల బకాయిల వసూళ్ల కోసం పలు మార్లు 'స్పెషల్ డ్రైవ్' పేరుతో ప్రజల్లో అవగాహన కల్పిస్తూ సంబంధిత అధికారులు పన్నులను జోరుగానే వసూలు చేశారు. ఇదిలా ఉండగా, దాదాపు 2300 ఇళ్లతో పాటు పలు వాణిజ్య, వ్యాపార సంస్థలు ఉన్న నార్సింగి గ్రామ పంచాయతీ కార్యాలయ సిబ్బంది మాత్రం పన్నుల వసూళ్లలో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెలువడుతున్నాయి. ఆన్లైన్ లో ఒకలా, కార్యాలయంలో మరోలా పన్ను వివరాలు నమోదు చేస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్నారని స్థానికులు అంటున్నారు. ప్రశ్నిస్తే దబాయింపులు, దురుసైన సమాధానాలు ఇస్తూ, తిట్టారంటూ కేసులు నమోదు చేయిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నా, అమాయక ప్రజలు ఏమి చేయాలో తెలియక మౌనం వహిస్తున్నారు.ఇటీవల సుతారి శ్రీనివాస్ (ఇంటి నం. 9-112/4) వద్దకు వెళ్లిన పంచాయతీ బిల్లు కలెక్టర్, కారోబార్ లు ఇంటి పన్ను చెల్లించాలని సూచించగా, శ్రీనివాస్ తన కుమారుడిని పంచాయతీ కార్యాలయానికి బకాయి వివరాల కోసం పంపించాడు. కరోనా కాలం నుంచి పన్ను చెల్లించలేదని మొత్తం రూ.20,800 బకాయి ఉందని తెల్ల కాగితం పై రాసి ఇచ్చారు. అనంతరం శ్రీనివాస్ గతంలో చెల్లించిన రసీదులు చూపగా, తప్పు జరిగిందని, బకాయి రూ.15,000 మాత్రమే ఉందని తెలిపారు. అయితే, ఆన్లైన్ లో కేవలం రూ.3,877 మాత్రమే బకాయి చూపుతుండటంపై ప్రశ్నించగా, దురుసుగా సమాధానం ఇవ్వడంతో పాటు స్థానిక పోలీస్ స్టేషన్ లో తమను తిట్టారంటూ కేసు నమోదు చేశారు. మరో ఘటనలో మందుగుల కిషన్ (ఇంటి నం. 8-104) ఖాళీ స్థలం కోసం ఆర్థిక సంవత్సరం 2024-25కు గాను రూ.560 (పంచాయతీ రసీదు నం. 544) వసూలు చేయగా, ఆన్లైన్ లో అదే రసీదు నంబర్ పై కేవలం రూ.198 మాత్రమే నమోదు అయినట్లు కనిపించింది. మిగతా రూ.362 ఎక్కడికి వెళ్లాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది ఒక్క ఇంటి పన్ను లో బయటపడిన అంశమే కాగా, బయటకు రాని ఇతర వ్యవహారాలు ఎలా ఉన్నాయో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా, పన్ను చెల్లింపులను సిబ్బంది యూ.పీ.ఐ ద్వారా తమ వ్యక్తిగత నంబర్లకు వేయించు కుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇంకా, కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి తక్కువ పన్ను విధించి, ఇతరులకు ఎక్కువగా విధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక సిబ్బందికి స్లాబ్ ఇల్లు, వాణిజ్య సముదాయం ఉన్నప్పటికీ కేవలం రూ.1,164 మాత్రమే పన్ను రావడం, మరొకరికి పెద్ద నిర్మాణం ఉన్నా రూ.572 మాత్రమే రావడం, అదే సమయంలో ఖాళీ స్థలానికి రూ.500 పైగా వసూలు చేయడం వంటి అంశాలు అనుమానాలకు తావిస్తున్నాయి. ఆన్లైన్ వివరాలు సాధారణంగా ప్రజలు పరిశీలించరనే భావనతో సిబ్బంది చెప్పిందే నమ్ముతారని భావించి అవినీతికి పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నార్సింగి పంచాయతీ కార్యాలయ సిబ్బంది చేస్తున్న అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ఎంపీడీఓ వివరణ :-** నార్సింగి గ్రామ పంచాయతీలో అధిక పన్నులు వసూలు చేయడం, ఇతర అక్రమాలపై ఎంపీడీఓ చిన్నారెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా, దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# పకడ్బందీగా జనగణన రూపకల్పన





- జనగణన మొదటి విడతలో చేపట్టే ఇండ్ల గణన బ్లాకుల రూపకల్పన
- పటిష్టంగా చేపట్టాలి.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

**టేక్మాల్ ఏప్రిల్ 01: సిరి న్యూస్**

పకడ్బందీగా జనగణన మొదటి విడతలో చేపట్టే ఇండ్ల గణన బ్లాకుల రూపకల్పన పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు.బుధవారం మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలోని ఇండ్ల జన గణన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జన గణన మొదటి దశలో బాగంగా చేపట్టే ఇండ్ల గణన ప్రక్రియ వచ్చే నెల మే 11 నుంచి జూన్ 09 వరకు నిర్వహించే ఇండ్ల జన గణనకు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇండ్ల గణన జాబితా బ్లాక్ లను తయారు చేయడానికి మండలంలోని ఒక రెవెన్యూ గ్రామాన్ని యూనిట్ గా తీసుకుని గరిష్టంగా 300ఇండ్లు లేదా 800 జనాబా ఉండేటట్లు ఇండ్ల గణన బ్లాక్ లను సిఎం ఎం ఎస్ పోర్టల్ ద్వారా తయారు చేయాలన్నారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా పటిష్టంగా జనగణన బ్లాకుల రూపకల్పన ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు . సిఎం ఎం ఎస్ పోర్టల్ నిర్వహణ చేసే ప్రక్రియ ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా చేసేందుకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ తులసి రామ్, ఎంపీడీవో రియాజ్ దీన్, ఆర్ ఐ సాయి శ్రీకాంత్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ శోభయాత్రను విజయవంతం చేయండి

- భట్కరి ప్రభు.

**సదాశివపేట. ఏప్రిల్ 1. (సిరి న్యూస్)**



సదాశివపేటలో హనుమాన్ నగర్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో భట్కరి ప్రభు ఆధ్వర్యంలో మందిరంలో పూజలు, స్వామివారికి అభిషేకాలు, డోలారోహణం, పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీఅన్న ప్రసాద వితరణ భట్కరి ప్రభు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, సాయంత్రం హనుమాన్ శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆశీస్సులు పొందాలని భట్కరి ప్రభు మరియు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# అక్రమంగా మట్టి రవాణా జెసిబిలు ట్రాక్టర్లు సీజ్



**తూప్రాన్ ఏప్రిల్ 1 సిరి న్యూస్**

తూప్రాన్ మండలంలోని యావాపూర్ గ్రామంలో బుధవారం రోజు మధ్యాహ్నం ప్రభుత్వ భూమిలో అక్రమ రోడ్లు వేస్తున్నారని మట్టి రవాణా చేస్తున్నట్టు తూప్రాన్తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి విశ్వాసనీయ సమాచారం రావడంతో యావపూర్ గ్రామ శివారిలో అక్రమంగా మట్టి తరలిస్తున్నటువంటి రెండు జెసిబిలను రెండు డాక్టర్లను పట్టుకుని తాసిల్దార్ ఆదేశాల మేరకు వాహనాలను తూప్రాన్ పోలీసు స్టేషన్ లో అప్పగించామని ఆర్ ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు అనుమతులు లేకుండా అక్రమ మట్టిని తరలించినట్లయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తూప్రాన్ తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు

# దాచినా దగలేదే ఎన్ఫోర్స్మెంట్ దాడి




**మునిపల్లి ఏప్రిల్ 1 (సిరి న్యూస్)**

మునిపల్లి మండల పరిధిలోని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ బృందం ఉదయం ప్రత్యేక తనిఖీ నిర్వహించగా, గోవా నుంచి వస్తున్న బస్సులో అక్రమంగా మత్తు పదార్థాలు తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ షానవాజ్ కాసిం ఆదేశాలతో, మెదక్ జిల్లా శాఖాధికారి జె. హరికేశన్ పర్యవేక్షణలో ఈ చర్య చేపట్టినట్టు అసిస్టెంట్ కమిషనర్ జి. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 7.40 గంటలకు నిఘా ఏర్పాటు చేసిన అధికారులు బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి బ్యాగులో నుంచి కొకైన్ 8.6 గ్రాములు, చరస్ 8.5 గ్రాములు, ఎండీఎంఏ 0.4 గ్రాములు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేశారు. స్వాధీనం చేసిన పదార్థాల మొత్తం విలువ దాదాపు రెండు లక్షల రూపాయలు ఉన్నట్టు పేర్కొన్నారు. నిందితుడు బీహార్ రాష్ట్రం కటిహార్ జిల్లాకు చెందిన 30 ఏళ్ల అబ్దుల్లా అని తెలిపారు.ఈ దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ అనిల్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ అలీమ్, కానిస్టేబుళ్లు కరీం, మల్కయ్య, ప్రహ్లాద్ రెడ్డి పాల్గొన్నారు. నిందితుడిపై ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

# హనుమాన్ శోభయాత్రను శాంతియుతంగా జరుపుకోవాలి

## డి.ఎస్.పి సత్తయ్య గౌడ్.



**సదాశివపేట. ఏప్రిల్ 1. (సిరి న్యూస్)**

హనుమాన్ జన్మదినోత్సవ సందర్భంగా గురువారం సాయంత్రం హనుమాన్ మందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే శోభయాత్ర శాంతియుతంగా జరపాలని ఆలయ కమిటీ సభ్యులకు డిఎస్పి సత్తయ్య గౌడ్ సూచించారు.శోభయాత్ర జరిగే వీధులను డి.ఎస్.పి, సీఐ వెంకటేశం పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా శ్రీ వీరాంజనేయ ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ మరియు ఆలయ కమిటీ సభ్యులు డిఎస్పి సత్తయ్య గౌడ్ ను సీఐ వెంకటేశను శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కొత్తగొల్ల సోమశేఖర్, చిన్న పటేల్, పవన్ గౌడ్, ఆశి రెడ్డి, భట్కరి ప్రభు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# స్వాధీనం చేసుకున్న ఇసుక కు బహిరంగ వేలం



**నార్సింగి, ఏప్రిల్ 1 (సిరి న్యూస్) :**

మండలం లోని శేరిపల్లి గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. సహాయక డైరెక్టర్, మైన్స్ & జియాలజీ, మెదక్ ఆదేశాల మేరకు తహసీల్దార్ గ్రేస్ బాయి, మండల ఆర్.ఐ మేఘన సంయుక్తంగా పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా శేరిపల్లి ఎస్సీ కాలనీ పరిధిలో సుమారు 18 ట్రాక్టర్ల ఇసుక నిల్వలను గుర్తించి, పంచనామా నిర్వహించి ప్రభుత్వ ఆధీనం లోకి స్వాధీనం చేసుకున్నారు. అక్రమ ఇసుక నిల్వలను అరికట్టడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు తహసీల్దార్ గ్రేస్ బాయి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇసుక వేలాన్ని ఏప్రిల్ 2 గురువారం మ. 3 గం. నార్సింగి తహసీల్దార్ కార్యాలయం ఆవరణ లో నిర్వహిస్తామని తెలిపారు. వేలంలో పాల్గొనాలన్న ఆసక్తి గల వారు అదే రోజు మ. 12 గం లోపు తమ పేర్లను తహసీల్దార్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

# ప్రతి పౌర్ణమి కి ఘనంగా పల్లకి సేవ



**పాపన్నపేట ఏప్రిల్ 1, (సిరి న్యూస్):**

మెదక్ జిల్లా ప్రసిద్ధి చెందిన ఏడుపాయల దేవస్థానం వద్ద ప్రతి పౌర్ణమి (పున్నమి రోజు) సందర్భంగా అమ్మవారి ఘనంగా పల్లకి సేవ నిర్వహించడం జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకి పై ఆలయ మాడ వీధుల గుండా, శోభ యాత్ర తో అమ్మవారిని ఊరేగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్చకులు శంకర్ శర్మ, పార్థుశర్మ, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, రవికుమార్, మధుసూదన్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి, మహేష్, నరేష్, సాయిబాబా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీటీడీసీఏ ఫార్మాసిస్టు కమిటీ చైర్మన్‌గా యెదిరె రమేశ్

**అందోలు, మార్చి 01,(సిరి న్యూస్):**



తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఫార్మాసిస్ట్ కమిటీ చైర్మెన్‌గా జోగిపేటకు చెందిన యెదిరె రమేశ్‌ను నియమిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోడుపునూరి రాజు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కోశాధికారిగా రమేష్ అసోసియేషన్ కి చేసిన విశిష్ట సేవలను అందిస్తున్నందుకుగాను రాష్ట్ర కెమిస్ట్ అసోసియేషన్ కార్యవర్గం లోకి తీసుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఫార్మాసిస్టు చైర్మన్‌గా నియమించినందుకుగాను రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రమేష్ నియామకం పట్ల జోగిపేట మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచకొండ సాయిబాబ, నాయకులు గుండా శ్రీనివాస్, కాశీనాథ్‌లు అభినందనలు తెలిపారు.

# వారసంత వేలం పాట




**తాండూర్ ఏప్రిల్ 1 (సిరి న్యూస్ ):**

తాండూర్‌లో వారసంతకు సంబంధించిన వేలం పాటను మార్కెట్ ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తాండూర్ ఎంపీడీఓ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్పంచ్ ముడిమడుగుల సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. 2026–2027 సంవత్సరానికి సంబంధించిన కూరగాయల మార్కెట్ వేలం పాటలో ఎనిమిది మంది వ్యక్తులు తలో రూ.10వేల డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. ఈ వేలంలో కిష్టంపేట గ్రామానికి చెందిన షేక్ మోమిన్ అలీ రూ.1లక్ష 12వేలకు బుధవారం వారసంత వేలం పాట పాడి మార్కెట్ హక్కులను దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దొంద దివాకర్, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ఖమ్మం ఏప్రిల్ 1 (సిరి న్యూస్ ):**



ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి మద్దులపల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొడ్డు గొర్ల ప్రసాద్ (పెయింటర్) మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో ప్రసాద్ మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుండగా, గుర్తుతెలియని కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసాద్ తలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న సీఐ ముష్కరాజు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా, ఈనెల 2న ప్రసాద్‌కు నిశ్చితార్థం జరగాల్సి ఉండగా, అంతలోనే ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇంట్లో జరగాల్సిన శుభకార్యం విషాదంగా మారింది.

# నేడు చైత్ర శుద్ద పౌర్ణిమ, హనుమత్ జయంతి సందర్భంగా శ్రీ గురు పీఠంలో ప్రత్యేక పూజలు

- **శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్ రమాదేవి దంపతులు**

**శివంపేట ఏప్రిల్ 1 (సిరి న్యూస్ )**



గురువారంచైత్ర శుద్ద పౌర్ణిమ, హనుమత్ జయంతి సందర్భంగా పురస్కరించుకొని శ్రీ గురు పీఠంలోని దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం, పంచవటి, శ్రీ శిరిడి సాయిబాబా దేవాలయంలో యథావిధిగా విశేష పూజలు నిర్వహించబడును. ఉదయం 6: 30 కు కాకడ ఆరతి ఏడు గంటలకు బాబా అభిషేకము అలంకరణ మరియు బాబా ఉత్సవ విగ్రహానికి అభిషేకము అష్టోత్తర నామార్చన ఆరతి ఇవ్వబడుతుంది అదేవిధంగా దత్తాత్రేయ స్వామి దేవాలయంలో స్వామి ఉత్సవ విగ్రహానికి అభిషేకము శతనామార్చన ఇవ్వబ డుతుంది. మధ్యాహ్నం 12.30ని.లకు బాబా మధ్యాహ్న ఆరతి ఉంటుంది తదనంతరం అరగంటసేపు సాయి దేవాలయంలో సత్సంగ్ నిర్వ హించబ డును. ఆ తదుపరి జీడిమెట్ల వాస్తవ్యులైన మేడ్చల్ జిల్లా దయానంద్ స్వరూప దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి అన్న ప్రసాద వితరణ చేయగలరని భక్త మహాశయులందరికీ తెలియజే స్తున్నాం. భక్తులందరూ ఆయా పూజ సమయాల అనుసరించి దేవాలయానికి విచ్చేసి దత్త గురువుల ఆశీస్సులు పొందాలని మీ అందరికీ శుభాలు కలగాలని, ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో ఉండాలని శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ శ్రీ జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్, రమాదేవి, శ్రీ జి సూర్య కుమార్ గౌడ్,, సిజి శ్రీనివాస్ గౌడ్ శ్రీ వై రమణ గౌడ్, మహేష్ గుప్తా, శ్రీశాస్త్రులవామన శర్మ, శ్రీ మారేళ్ల మోహన్ రావు , శ్రీ నోముల హనుమంతు, శ్రీ రాజ్యం బిక్షపతి ఆ గురుదేవులను ప్రార్థిస్తున్నారు.

# రేషన్ షాప్ లో తూకంలో మోసం..!

- **తనిఖీ చేసిన గ్రామ సర్పంచ్ దాస్.**

**టేక్మాల్ ఏప్రిల్ 01: సిర న్యూస్ :**




రేషన్ దుకాణాల్లో బియ్యం తూకాల్లో మోసాలకు పాల్పడుతూ చేతివాటం ప్రదర్శిస్తుండడంతో నిరుపేదలు తీవ్రంగా నష్టపోతున్నా వైనం. బుధవారం మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరదిలోని వేల్పుగొండ గ్రామంలో చోటుచేసుకనది.గ్రామంలో సుమారు 600 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇదిలా ఉండగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన గ్రామీణ ప్రాంతానికి చెందిన లబ్ధిదారులుప్రతి నెల 1 వ తేది నుండి 20వ తేది వరకు రేషన్ దారులకు నిత్యావసర సరుకులుపంపిణి చేస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లబ్ధిదారులకు మూడు నెలలకు సరిపడా సరుకులను రేషన్ డీలర్ లు అందించాలని ఆదేశించారు. వేల్పుగొండ రేషన్ డీలర్ నిర్లక్ష్యం వల్ల రేషన్ షాపులో ఎలక్ట్రానిక్ కాంట సెట్టింగ్ తో 500 గ్రాములు కాంట పై500 గ్రాములు గొనె సంచి వేసి మొత్తం ఒక్క రేషన్ కార్డు పై 1కిలో తరుగు తీసివేస్తున్నారని రేషనకార్డుదారులు స్థానిక సర్పంచ్,నిరుడి దాస్ ఉప , గ్రామ కార్యదర్శి రాఘవేంద్రర్ దృష్టికి తీసుకెళ్లగా రేషన్ షాప్ ను బుధవారం సందర్శించాగా వాస్తవానికి ఎలక్ట్రానిక్ కాంట తూకంలో మోసం జరిగిందని ఎలక్ట్రానిక్ కాంటాపై గోనెసంచి వేసున్నారని నిర్ధారించారు. స్థానిక డీలర్ ను అడగగా గత సంవత్సరం నుండి జోనసంచి వేస్తున్నామని రేషన్ డీలర్ చెప్పడం జరిగింది. ఉన్నత స్థాయి అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

# మాజీ మున్సిపల్ చైర్మన్ సిహెచ్ నరసింహ గౌడ్ 31 వ వర్ధంతి

- **మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సిహెచ్ శ్రీనివాస్ గౌడ్.**

**సదాశివపేట. ఏప్రిల్ 1. (సిరి న్యూస్)**



సదాశివపేట పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ కీర్తిశేషులు సిహెచ్ నరసింహ గౌడ్ 31వ వర్ధంతి వేడుకలు సదాశివపేట పట్టణంలో కల్లుగీత కార్మిక సంఘం లో మాజీ వైస్ చైర్మన్ సిహెచ్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కీర్తిశేషులు సిహెచ్ నరసింహ గౌడ్ అభిమానులు పాల్గొని సిహెచ్ నరసింహ గౌడ్ సేవలు చరిత్రలో నిలిచే విధంగా ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని కొనియాడారు. అందుకు కీర్తిశేషులు సిహెచ్ నరసింహ గౌడ్ తనయుడు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సిహెచ్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో ఉన్న సంతృప్తి ఇంకా ఎందులో ఉండదని, అందుకు నిదర్శనంగా కీర్తిశేషులు సిహెచ్ నరసింహ గౌడ్ ని గుర్తించిన సదాశివపేట పట్టణ ప్రజలకు, అభిమానులకు పేరుపేరునా ఆత్మభివందనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ శంకర్ గౌడ్, సిహెచ్ అనిల్ గౌడ్, మాజీ కౌన్సిలర్ ఆకుల శివ, శంకర్పల్లి శ్రీనివాస్ గౌడ్, కాటం మల్లేశం గౌడ్, పందు గౌడ్, జగదీష్ గౌడ్, శంకర్ గౌడ్ పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మీ సేవ చార్జీల పెంపు అమల్లోకి

- **అదనపు కలెక్టర్ నగేష్**

**మెదక్ ఏప్రిల్ 1. (సిరి న్యూస్) :**




రాష్ట్ర ప్రభుత్వం 'మీ సేవ' కేంద్రాల ద్వారా అందించే వివిధ సేవలకు చార్జీలు పెంచినట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ, నేటి నుంచే కొత్త చార్జీలు అమల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు.గత 10 సంవత్సరాలుగా మీసేవ నిర్వాహకులు కోరుతున్న డిమాండ్ నెరవేరిన నేపథ్యంలో, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు రూ.35గా ఉన్న కనీస ఛార్జీని రూ.62కు పెంచినట్లు వెల్లడించారు.A కేటగిరీ సేవలకు రూ.62, B కేటగిరీ సేవలకు రూ.80గా రుసుము నిర్ణయించిందన్నారు. B కేటగిరీలో కమ్యూనిటీ, ఆదాయం, నివాస ధ్రువపత్రాలు, రేషన్ కార్డు, OBC, EWS సర్టిఫికెట్లు, విద్యుత్ కనెక్షన్ వంటి సేవలు ఉంటాయని చెప్పారు.ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రతి నెల 3వ తేదీన నిర్వహించే మెయింటినెన్స్ డే సందర్భంగా మీసేవ కేంద్రాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేయవని తెలిపారు.ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, మీసేవ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ నగేష్ స్పష్టం చేశారు.

# బౌద్ధ పౌర్ణమి రోజు అధికారిక సెలవు ప్రకటించాలి

**ఆదిలాబాద్ ఏప్రిల్ 1. (సిరి న్యూస్):**




బుద్ధ జయంతి (బౌద్ధ పౌర్ణమి) రోజును తెలంగాణ ప్రభుత్వం అధికారిక ప్రభుత్వ సెలవుగా ప్రకటించి రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞ కుమార్, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమ్ రావు వాగ్మేరే, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు విఠల్ కోరారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. బౌద్ధ భిక్షువులకు వేతనాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. బౌద్ధ పౌర్ణమికి ఉన్న చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను వివరించారు. ఈ విషయంపై డీసీసీ అధ్యక్షుడు సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దయానంద్, బాబా సాహెబ్ జాబడే, బ్రీజ్ లాల్ కర్మన్కర్, సోగల సుదర్శన్, శివాజీ కాంబ్లీ, పరమేశ్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బౌద్ధ మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.




## ఐపీఎల్ పాస్‌లు, టికెట్ల బ్లాక్ మార్కెటింగ్‌పై
# ఈడీకి టీసీఏ ఫిర్యాదు

**హెచ్‌సీఏ ఖాతాలు, లావాదేవీలను పరిశీలించాలని వినతి**

**హైదరాబాద్:** ఐపీఎల్ పాస్ లు, టికెట్ల బ్లాక్ మార్కెటింగ్ పై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఈడీ కి ఫిర్యాదు చేసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పెద్దలు.. ఐఐపీఎల్ టికెట్లు, పాస్ లు బ్లాక్ మార్కెట్ వైపు మళ్లించారని.. కోట్ల రూపాయలు కొల్లగొట్టేందుకు యత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. గత 10 ఏళ్లలో దాదాపు 600 కోట్ల వరకు అవినీతి జరిగిందని.. హెచ్‌సీఏ ఖాతాలు, లావాదేవీలను పరిశీలించాలని కోరింది. ప్రభుత్వ సంస్థల క్రికెట్ క్లబ్ లను ఒక్కొకటి 2 నుంచి 2.5 కోట్లకు ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకున్నారని ఫిర్యాదులో పేర్కొంది. నిధుల దుర్వినియోగం, ఫోర్జరీ, తప్పుడు ఖాతాల నమోదు, నకిలీ పత్రాలతో పెద్ద ఎత్తున స్కాం లు జరిగాయని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఫిర్యాదు లో పేర్కొన్నది. జీహెచ్ఎంసీ/ఎంసీహెచ్‌కి చెందిన 17 క్రికెట్ క్లబ్‌లను అక్రమంగా ప్రైవేటీకరించి, ప్రతి క్లబ్‌ను.. ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేశారని ఆరోపించింది. 103 ఒరిజినల్ క్లబ్ లను మాయం చేసి.. 80 కి పైగా నకిలీ క్లబ్ లను హెచ్‌సీఏలో చేర్చారని ఫిర్యాదులో పేర్కొంది.


Page 3 of 6

diversion of institutional funds, causing wrongful loss to HCA and unlawful gain to private individuals and persons in control of HCA. The said amount is public accountable money and must be recovered by attaching properties and freezing bank accounts of those responsible.

**(C) Illegal Privatization / Sale of Government GHMC/MCH Clubs:**
It is reliably represented that 17 GHMC/MCH cricket clubs, which are public Government/municipal assets meant for public sports development, were illegally privatized/handed over/sold to private individuals by HCA office bearers in collusion with private persons. Such acts amount to illegal alienation of Government property and unlawful occupation of public assets.

**(D) Membership Fraud and Vote Manipulation:**
HCA has allegedly:
- caused disappearance of 103 genuine member clubs,
- Illegally added 80+ fraudulent clubs,

# ప్రియ ముందంజ

**ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్**

**ఉలన్‌బాతర్(మంగోలియా):** ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల మెరుగైన ప్రదర్శన కొనసాగుతున్నది. పోటీల రెండో రోజైన మంగళవారం జరిగిన మహిళల 60కిలోల బౌట్‌లో ప్రియ 5-0 తేడాతో రిమ్మా వోలెసెంకో(కజకిస్థాన్)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన ప్రియ... పవర్‌ఫుల్ పంచ్‌లతో విరుచుకుపడుతూనే మరోవైపు ప్రత్యర్థికి దీటుగా బదులిస్తూ ముందుకు సాగింది. మరోవైపు పురుషుల 55కిలోల బౌట్‌లో జాదుమణిసింగ్ 2-3 తేడాతో రిమా యమగుచి(జపాన్)పై పోరాడి ఓటమిపాలయ్యాడు. ఈ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ బాక్సర్‌గా కొనసాగుతున్న యమగుచికి జాదుమణి దీటైన పోటీనిచ్చాడు.



# ఢిల్లీ క్యాపిటల్స్ 'సూపర్' విక్టరీ!

### ఆరు వికెట్ల తేడాతో లక్నోపై ఘన విజయం..

### బౌలింగ్‌లో నటరాజన్, ఎంగిడి.. బ్యాటింగ్‌లో సమీర్ రిజ్వీ, అదుర్స్





**ఢిల్లీ :** ఉత్కంఠభరిత మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ పై ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలర్ల విజృంభణకు తోడు బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో లక్నో పెట్టిన మోస్తరు లక్ష్యాన్ని ఢిల్లీ సునాయాసంగా ఛేదించింది. పదిహేడు బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని తమ ఖాతాలో వేసుకుని సత్తా చాటింది. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ సారథి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు.. ఢిల్లీ బౌలర్ల ధాటికి పెవిలియన్ కు క్యూ కట్టారు. అబ్దుల్ సమద్, (25 బంతుల్లో 36 పరుగులు).. మిచెల్ మార్ష్, (28 బంతుల్లో 35 పరుగులు) కాస్త పోరాడినప్పటికీ మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో లక్నో జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. షాబాజ్ అహ్మద్, 16 బంతుల్లో 15 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇరవై ఓవర్లు కూడా పూర్తి చేయకుండానే.. 18.4 ఓవర్లలో 141 పరుగులకే లక్నో జట్టు ఆలౌట్ అయ్యింది.

**ఢిల్లీ బౌలర్ల మాయాజాలం..**

లక్నో పతనాన్ని శాసించడంలో ఢిల్లీ బౌలర్లు కీలక పాత్ర పోషించారు. పేసర్ లుంగి ఎంగిడి, కేవలం 3.4 ఓవర్లు వేసి 27 పరుగులిచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. మన తెలుగోడు నటరాజన్, కూడా నాలుగు ఓవర్లలో 29 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు తీసి లక్నో నడ్డివిరిచాడు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని మరింత కష్టాల్లోకి నెట్టాడు.

**సమీర్ రిజ్వీ, ఒంటిచేత్తో..**

142 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఆదిలోనే తడబాటు ఎదురైనా.. ఆ తర్వాత నిలకడగా ఆడి విజయం సాధించింది. ముఖ్యంగా యువ బ్యాటర్ సమీర్ రిజ్వీ, అద్భుతమైన బ్యాటింగ్ తో ఆకట్టుకున్నాడు. 47 బంతులు ఎదుర్కొన్న రిజ్వీ.. 70 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు. అతనికి తోడుగా ట్రిస్టన్ స్టబ్స్, 32 బంతుల్లో 39 పరుగులతో అజేయంగా క్రీజులో నిలిచి మ్యాచ్ ను ముగించాడు. నితీష్ రాణా, 15 పరుగులు చేశాడు. ఢిల్లీ జట్టు 17.1 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 145 పరుగులు చేసి గెలుపు సంబరాలు చేసుకుంది.

**పోరాడిన ప్రిన్స్ యాదవ్,**

లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్, మూడు ఓవర్లలో 20 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. మొహ్సిన్ ఖాన్, మొహమ్మద్ షమీ, చెరో వికెట్ తీసుకున్నారు. తక్కువ స్కోరును రక్షించుకునే క్రమంలో లక్నో బౌలర్లు శాయశక్తులా ప్రయత్నించినా.. ఢిల్లీ బ్యాటర్ల ముందు వారి పప్పులు ఉడకలేదు. తుది ఫలితంగా లక్నోకు పరాజయం తప్పలేదు.



# స్లో ఓవర్ రేట్..

### కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు 12 లక్షల ఫైన్

**ఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ఎట్టకేలకు బోణి కొట్టింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో 3 వికెట్ల తేడాతో విజయం సాధించి పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. అయితే ఈ గెలుపు సంబరాల్లో ఉన్న పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బీసీసీఐ గట్టి షాక్ ఇచ్చింది. మ్యాచ్ గెలిచిన ఆనందంలో ఉన్న అయ్యర్‌పై భారీ జరిమానా విధిస్తూ ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది.

**తప్పని 'స్లో ఓవర్ రేట్' దెబ్బ**

గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ నిర్ణీత సమయంలోగా ఓవర్లను పూర్తి చేయలేకపోయింది. స్లో ఓవర్ రేట్ నిబంధనను ఉల్లంఘించినందుకు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించారు. ఈ సీజన్‌లో ఈ నిబంధన కింద జరిమానా ఎదుర్కొన్న తొలి కెప్టెన్‌గా అయ్యర్ నిలిచాడు. ఇది మొదటి తప్పు కావడంతో కేవలం ఫైన్‌తో సరిపెట్టారని, ఇదే పునరావృతమైతే కెప్టెన్‌పై నిషేధం పడే అవకాశం ఉంటుందని అధికారులు హెచ్చరించారు.

**కూపర్ కానలీ మెరుపులు**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 162 పరుగులు చేసింది. అనంతరం 163 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ 19.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌తో ఐపీఎల్ అరంగేట్రం చేసిన యువ ఆటగాడు కూపర్ కానలీ అద్భుత ఇన్నింగ్స్ ఆడి పంజాబ్‌ను గెలిపించాడు. కేవలం 44 బంతుల్లోనే 72 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. జట్టు గెలిచినప్పటికీ, బ్యాటింగ్‌లో కేవలం 18 పరుగులకే వెనుదిరగడం, చేతికి గాయం కావడం, దానికి తోడు భారీ జరిమానా పడటంతో అయ్యర్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# 3 కోట్ల ఫుట్‌ఫాల్స్ దాటేసిన ధురంధర్–2



రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోంది. వసూళ్లలోనే కాకుండా, థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య (ఫుట్‌ఫాల్స్) విషయంలో కూడా ఈ సినిమా బాలీవుడ్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో 3 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను దాటేసింది. కరోనా తర్వాత ఈ ఘనత సాధించిన ఆరో హిందీ చిత్రంగా 'ధురంధర్ 2' నిలిచింది. గతంలో 'గదర్ 2', 'జవాన్', స్త్రీ 2, ఛావా, 'ధురంధర్' మొదటి భాగం మాత్రమే ఈ మార్కును చేరుకున్నాయి. ప్రస్తుతం హిందీ వెర్షన్లలో అత్యధిక ఫుట్‌ఫాల్స్ సాధించిన చిత్రంగా 'పుష్ప 2' (దాదాపు 4 కోట్లు) కొనసాగుతోంది. అయితే, 'ధురంధర్: ది రివెంజ్' హవా చూస్తుంటే.. ఫుల్ రన్ ముగిసే సమయానికి అన్ని భాషల్లో కలిపి 5 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను సాధించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఈ రెండు భాగాలు కలిపి మొత్తం 8 కోట్లకు పైగా టికెట్లు అమ్ముడవడం అనేది భారతీయ సినిమా చరిత్రలో ఒక అసాధారణమైన విజయంగా రికార్డు సృష్టించనుంది. కలెక్షన్ల పరంగా 'ధురంధర్ 2' సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన 13వ రోజు కూడా ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను సాధించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా రూ.1400 కోట్ల మార్కును దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది. భారతదేశంలో ఈ సినిమా ఇప్పటివరకు రూ.899 కోట్ల నెట్ వసూళ్లను సాధించగా, బుధవారం మార్నింగ్ షోలతో రూ.900 కోట్ల మైలురాయిని చేరుకుంది. రెండో వీకెండ్‌లో రూ.170 కోట్లు వసూలుచేయడంతో భారతీయ సినిమా చరిత్రలోనే అత్యధిక రెండో వారాంతపు వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది.




# 10న వస్తున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ

తమిళ యువ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ సినిమాలో టాలీవుడ్ బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే సెన్సార్ పనులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్ అందుకున్న ఈ చిత్రం, అనేక వాయిదాల తర్వాత ఏప్రిల్ 10న తమిళంతో పాటు తెలుగులోనూ గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా తెలుగులో టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ విషయానికి వస్తే.. ఇది 2040వ సంవత్సరం నేపథ్యంలో సాగే ఒక ఆసక్తికరమైన ఫ్యూచరిస్టిక్ రొమాంటిక్ డ్రామాగా కనిపిస్తోంది. ప్రస్తుత కాలంలోని ఇన్‌స్టంట్ రిలేషన్ షిప్స్‌ను ఇష్టపడని హీరో(ప్రదీప్ రంగనాథన్) హీరోయిన్ (కృతి శెట్టి), పాతకాలం నాటి స్వచ్ఛమైన ప్రేమను కోరుకుంటారు. అయితే వీరి ప్రేమకథకు ఎస్. జే సూర్య ఎలా అడ్డుపడతాడు. ఎస్. జే సూర్య నడుపుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే సంస్థ ఉద్దేశ్యం ఏంటి అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇందులో ప్రేమ గురించే కాకుండా 2040లో ఏం మార్పులు రాబోతున్నాయి అనే చిన్న చిన్న విషయాలను కూడా చాలా చక్కగా చూపించారు మేకర్స్. యోగి బాబు, సీమన్, గౌరీ కిషన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నఈ చిత్రాన్ని లేడీ సూపర్ స్టార్ నయనతారతో కలిసి ఎస్.ఎస్. లలిత్ కుమార్ నిర్మించారు.

# బిజీ షెడ్యూల్ వల్లనే డ్రాగన్‌లో నటించలేకపోయా

## మళయాళ నటుడు టొవినో థామస్ వెల్లడి

టాలీవుడ్ హీరో ఎన్టీఆర్– కన్నడ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ఓ పాత్ర కోసం మలయాళ నటుడు టొవినో థామస్‌ని చిత్ర బృందం ఎంపిక చేయనున్నట్లు ఇటీవల వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. వీటిపై టొవినో స్పందించారు. తన కొత్త సినిమా 'పళ్లిచట్టంబి' ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో క్లారిటీ ఇచ్చారు. మలయాళంలో వేరే సినిమాలు చేస్తుండటంతో.. డేట్స్ సర్దుబాటు కాక 'డ్రాగన్'లో నటించట్లేదని తెలిపారు. ' తెలుగు సినిమాల్లో నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. మలయాళంలో వర్కింగ్ కల్చర్ టాలీవుడ్‌కు భిన్నంగా ఉంటుంది. తక్కువ సమయంలోనే షూటింగ్ పూర్తి చేస్తాం. తెలుగు చిత్రాల షూటింగ్ షెడ్యూల్స్ ఎక్కువ ఉంటాయి. పైగా ఒకేసారి రెండు/మూడు చిత్రాల్లో నటించడం నాకు ఇష్టం ఉండదు. ఒక సినిమా పూర్తయ్యాకే మరో సినిమా చేస్తుంటా. ఒకవేళ నేను టాలీవుడ్‌లో ఓ పెద్ద సినిమాలో నటిస్తే.. నేను అంగీకరించిన మూడు/నాలుగు మలయాళ చిత్రాలపై ప్రభావం పడుతుంది. అందుకే తెలుగు సినిమాల్లో నటించలేకపోతున్నా' అని వివరించారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించిన 'పళ్లిచట్టంబి' ఏప్రిల్ 10న తెలుగులోనూ విడుదల కానుంది.








# సెట్స్‌లో నటి పట్ల అసభ్య ప్రవర్తన

## మళయాళ దర్శకుడు రంజిత్ అరెస్ట్

ప్రముఖ మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌ను లైంగిక వేధింపుల ఆరోపణలపై కొచ్చి పోలీసులు అరెస్ట్ చేశారు. ఒక యువ నటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎర్నాకుళం సెంట్రల్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఒక సినిమా సెట్‌లో రంజిత్ తనతో అనుచితంగా ప్రవర్తించారని ఇటీవల ఓ నటి ఫిర్యాదు చేసింది. ఈ ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ప్రాథమిక విచారణ కోసం కొచ్చికి తరలించారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడానికి ముందు, చిత్ర యూనిట్‌లోని అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేశారు. కమిటీ సభ్యులు దానిని పరిశీలించి, అది తీవ్రమైన అంశంగా గుర్తించడంతో తదుపరి చర్యల కోసం కేసును కేరళ పోలీసులకు బదిలీ చేశారు. హేమ కమిటీ నివేదిక వెలువడిన తర్వాత మలయాళ సినీరంగంలో బయటపడుతున్న వరుస వేధింపుల కేసుల్లో ఇది మరొకటి కావడం గమనార్హం. గతంలోనూ రంజిత్‌పై ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. 2024లో బెంగాలీ నటి చేసిన వేధింపుల ఆరోపణల వల్ల ఆయన తన కేరళ చలనచిత్ర అకాడమీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అప్పట్లో ఆ ఆరోపణలను రంజిత్ తోసిపుచ్చినప్పటికీ, తాజాగా మరో నటి ఫిర్యాదు చేయడంతో ఆయన చుట్టూ ఉచ్చు బిగిసినట్లయింది.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.